# సింహప్రసాద్

# 63 బహుమతి కథానికలు



# విషయసూచిక


| | కథానిక పేరు | బహుమతి ప్రదాత | సంవత్సరం | పుట సంఖ్య |
|---|---|---|---|---|
| 1. | గోమాత | నవ్య | 2018 | 23 |
| 2. | అగ్నిస్వరాలు | ఉపాధ్యాయ | 2018 | 36 |
| 3. | చెమ్మ | రంజని | 2017 | 43 |
| 4. | విలువ - విలువలు | ఆంధ్రభూమి దినపత్రిక | 2017 | 54 |
| 5. | దృక్పథం | ఆర్జీబీ ఇన్ఫొటెక్ | 2017 | 66 |
| 6. | ఒక్కమాట | విశాలాక్షి | 2017 | 76 |
| 7. | హర్షఋతువు | నవ్య వారపత్రిక | 2017 | 86 |
| 8. | పురుషుడు | చినుకు | 2017 | 98 |
| 9. | యోధ | నారీ భేరి | 2017 | 110 |
| 10. | జమ్మిచెట్టు | ఆంధ్ర సారస్వత సమితి | 2016 | 118 |
| 11. | మనుష్యఋణం | సోమేపల్లి పురస్కారం | 2016 | 132 |
| 12. | ఫీనిక్స్ | నోముల పురస్కారం | 2016 | 139 |
| 13. | అనకొండ | ఆంధ్రభూమి వారపత్రిక | 2016 | 150 |
| 14. | గోచర | నవ్య వారపత్రిక | 2016 | 157 |
| 15. | మా మల్లవరం మామయ్య | రచన | 2016 | 167 |
| 16. | సాహసం సేయరా డింభకా | స్వాతి వారపత్రిక | 2016 | 176 |
| 17. | ఆశావహం | సోమేపల్లి పురస్కారం | 2015 | 185 |
| 18. | బతుకు | నవ్య వారపత్రిక | 2015 | 192 |
| 19. | కదలిక | ప్రజాశక్తి | 2015 | 205 |
| 20. | ప్రతిధ్వని | ఆంధ్రభూమి దినపత్రిక | 2014 | 216 |
| 21. | నేల | నవ్య వారపత్రిక | 2014 | 227 |

| | | | |
|---|---|---|---|
| 22. ఒక యుద్ధం, ఒక సంధి, ఒక శాంతి | స్వాతి వారపత్రిక | 2014 | 239 |
| 23. ఆత్మపదార్థం | రచన | 2014 | 247 |
| 24. పరబ్రహ్మ | స్వాతి వారపత్రిక | 2014 | 264 |
| 25. గబ్బిలం | జాషువా పరిశోధన కేంద్రం | 2014 | 276 |
| 26. మోడల్ | కథాకేళి | 2014 | 292 |
| 27. మనిషి దేవోభవ | రంజని | 2013 | 301 |
| 28. ఓ సీత కథ | ఆంధ్రభూమి దినపత్రిక | 2013 | 311 |
| 29. గాంధీ తాత నవ్వేదు | ఆంధ్రభూమి వారపత్రిక | 2013 | 320 |
| 30. వాయసం | నవ్య వారపత్రిక | 2013 | 330 |
| 31. విషపరిష్వంగం | నవ్య వారపత్రిక | 2013 | 335 |
| 32. రేపింతే | ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక | 2012 | 345 |
| 33. వంశవృక్షం | ఆంధ్రభూమి దినపత్రిక | 2012 | 350 |
| 34. మనసా తొందర పడకే | ఆంధ్రభూమి మాసపత్రిక | 2012 | 361 |
| 35. రోమ్-నీరో-ఫిడేలు | ప్రజాశక్తి | 2012 | 369 |
| 36. వానా వానా వల్లప్ప | స్థానిక పాలన | 2011 | 379 |
| 37. వటపత్రశాయి | నవ్య వారపత్రిక | 2011 | 387 |
| 38. తల్లీ నిన్ను దలంచి | రంజని | 2011 | 397 |
| 39. గుప్పెడు | స్వప్న | 2011 | 407 |
| 40. జారుడు మెట్లు | చిత్ర | 2011 | 411 |
| 41. పాత నీరు | స్వాతి వారపత్రిక | 2011 | 420 |
| 42. శైశవ గీతి | జాగృతి వారపత్రిక | 2010 | 429 |
| 43. రియాల్టీ షో | ఆంధ్రజ్యోతి దిన పత్రిక | 2010 | 438 |
| 44. ఆశ్రయం | రంజని | 2010 | 448 |
| 45. ఓటు(టి) షో | ఆంధ్రభూమి దినపత్రిక | 2010 | 457 |

| | | | |
|---|---|---|---|
| 46. పెళ్లీ పెటాకులూ | ఆంధ్రప్రదేశ్ మాసపత్రిక | 2010 | 465 |
| 47. చిన్ని చిన్ని ఆశ | కథాకేళి | 2010 | 473 |
| 48. విశ్వమానవుడు | నవ్య వారపత్రిక | 2010 | 480 |
| 49. హే రామ్ | చిత్ర | 2010 | 489 |
| 50. జీరో సైజు | స్వాతి వారపత్రిక | 2010 | 498 |
| 51. ముడుపు | ఈనాడు | 2009 | 506 |
| 52. ఆశావహం | వేదగిరి కమ్యూనికేషన్స్ | 2009 | 514 |
| 53. నరుడి బతుకు నటన | ఆంధ్రజ్యోతి వారపత్రిక | 1997 | 522 |
| 54. దొంగ బతుకు | ఆంధ్రజ్యోతి వారపత్రిక | 1997 | 529 |
| 55. ముందే కూసిన కోయిల | ఆంధ్రభూమి వారపత్రిక | 1994 | 534 |
| 56. జయహే | ఆంధ్రజ్యోతి వారపత్రిక | 1993 | 544 |
| 57. హారతీ! ఓ హారతీ! | మయూరి | 1986 | 548 |
| 58. పొగమేడలు | ఆంధ్రజ్యోతి వారపత్రిక | 1983 | 565 |
| 59. అల్పమానవుడు | యువ | 1981 | 576 |
| 60. మాల్ న్యూట్రిషన్ | వంశీ - బర్కిలీ అవార్డ్స్ | 1980 | 585 |
| 61. కుంకుమ బొట్టు | వంశీ - బర్కిలీ అవార్డ్స్ | 1979 | 592 |
| 62. రుక్మిణీ కల్యాణం | చక్రవర్తి | 1978 | 605 |
| 63. చుక్కలు | విశ్వసాహితి | 1978 | 612 |

ఉపాధ్యాయ మాసపత్రిక కథల పోటీలో
ప్రథమ బహుమతి పొందిన కథ

# అగ్నిస్వరాలు

ఇంటి ముందు కారు పార్కు చేసి లోపలికెళ్ళబోతూ యథాలాపంగా ఓ పక్కకి చూశాను.

ఆకృతి స్కూటర్ లేదు. వాచీ చూశాను. రాత్రి తొమ్మిదీ పది. ఇంతదాకా ఎక్కడ షికార్లు కొడుతోందో!

"సుధా! ఆకృతి ఇంకా రాలేదేంటి? ఎక్కడుందో ఏమైనా ఫోన్ చేసిందా?" లోపలికెళ్తూనే అసహనంతో రగుల్తూ అడిగాను.

"కన్నాట్ ప్లేస్ కెళ్తున్నానని సాయంత్రమెప్పుడో చెప్పింది. ఏవో బుక్స్ కొనుక్కోవాలంది"

"ఒక్కతే వెళ్ళిందా?"

"ఫ్రెండ్సంతా వెళ్ళుంటారు...."

"నిమ్మకి నీరెత్తినట్టు మాట్లాడతావేంటి? ఇది ఢిల్లీ తెలుసా? మన ఊరూ కాదు వాడా కాదు, గుండెల మీద చేతులేసుకుని నిశ్చింతగా వుండటానికి!"

"మీరు మరీనూ. ఇదేదో అడవి అన్నట్టు మట్లాడతారేంటి. పేపర్లలో ఏవేవో రాస్తూంటారు. అవన్నీ చదివి భయపడ్తూ కూర్చుంటే ఇక బతికినట్టే!"

"నీకర్థం కాదులే. ఇంకో రెండేళ్ళు ముక్కు మూసుకుని గడిపేస్తే రిటైరైపోతాను. హాయిగా హైదరాబాదెళ్ళి సెటిలైపోవచ్చు....."

"అక్కడికదేదో భద్రనగరమైనట్టు! ఆడది ఏ ఊళ్ళో అయినా ఏ కాలంలో అయినా ఒడిలో నిప్పులు మోస్తూ తిరగాల్సిందే!"

పిచ్చిగా చూశాను. "అర్థం లేకుండా మాట్లాడకు. ఆడది అణిగి మణిగి వుండాలి. తలుపు చాటున గాకపోయినా లక్ష్మణ రేఖకి లోపలే వుండాలి. అప్పుడే వాళ్ళు హ్యాపీ, వాళ్ళ వాళ్ళు హ్యాపీ......"

సుధ అదోలా చూసి వెళ్ళిపోయింది. ఆ చూపులో నిరసనధ్వని వుందా?

స్నానం చేసొచ్చాను. వేడి వేడి అన్నం వడ్డించింది. తినబోతూ, "ఆకృతి మళ్ళీ

ఫోన్ చేసిందా?" అడిగాను.

"లేదు"

"బొత్తిగా బాధ్యత లేదు......" విసుక్కుంటూ సెల్ అందుకున్నాను.

ఆకృతి కాల్ రిసీవ్ చేసుకోగానే, "ఎక్కడున్నావ్?" అనడగ్గా, "వచ్చేస్తున్నా డాడ్. ఆన్ ద వే" అని జవాబిచ్చింది.

"జాగ్రత్తగా రా"

"ఎవర్నుంచి, దేన్నుంచి జాగ్రత్త?"

"తల తిక్క క్వొశ్చన్సొద్దు. తిన్నగా ఇంటికిరా"

లైన్ కట్ చేసి "అర్థరాత్రి దాకా షికార్లు చేసిందిగాక ఎదురు ప్రశ్నలొకటి! ఏం పిల్లలో ఏం పాడో! పుట్టిన ఒక్కరూ మగపిల్లాడై వుంటే ఈ భయాలేవీ వుండేవి కావు, వంశమూ నిలబడేది!" గొణుక్కున్నాను.

"ఆడపిల్లల్లోనూ మీ జీన్సూ, మీ పూర్వీకుల జీన్సూ వుంటాయి" నవ్వుతూ చురక అంటించింది సుధ.

"ఆ గోలెవడిక్కావాలి? మగపిల్లాడైతే ఎక్కడున్నాడు, ఏం చేస్తున్నాడు, ఎలా వుంటున్నాడు, ఎప్పుడు ఇంటికొస్తాడు అన్న భయాలుండవు. ఎప్పుడే ప్రక్కనుంచి ఎలాంటి ప్రమాదం వచ్చి పడుతుందోనన్న ఆందోళనా వుండదు. పెళ్లి చేసి పంపేక కట్టుకున్నవాడు చక్కగా చూసుకుంటున్నాడో లేక వేపుకు తింటున్నాడోనన్న పీడకలలూ వుండవు.....!"

"మీరు మరీనూ. లోకంలో ఇందరు తండ్రులున్నారు. ఎవరూ మీలాగా వుండరు"

"ఉండాలే. కాలం అలా వుంది. మన ఢిల్లీలో పద్దెనిమిది గంటలకో మహిళ అత్యాచారానికి గురవుతోందిట. ఈ ఏడాదిలో ఇంతవరకూ 580 అత్యాచారాలు నమోదయ్యాయిట. ఇక రికార్డుకెక్కనివి ఎన్నున్నాయో! అసలిలాంటి గొడవలొస్తాయనే ఆడపిల్లకి పదేళ్ళకే పెళ్ళి చేసి అత్తారింటికి పంపెయ్యలన్నారు పూర్వులు......."

"వివాహితల్ని మృగాళ్ళు కనికరిస్తున్నారంటారా డాడ్" వస్తూనే పిడుగు విసిరింది ఆకృతి.

నాకు పులమారింది.

"నువ్వు బాగా ఆర్గ్యూ చేస్తావని తెలుసులే. ఆర్గ్యుమెంట్లు వేరు, వాస్తవం వేరు. మన స్థితినీ స్థానాన్నీ మరచిపోకూడదు. వీకర్ జెండర్ అన్న స్పృహ కలిగే వుండాలి. అలాగే మసలాలి. ముల్లొచ్చి ఆకు మీద పడ్డా, ఆకెళ్ళి ముల్లు మీద పడ్డా ఆకుకే నష్టం"

పెదాలు విడీ విడకుండా నవ్వింది. "ముల్లు మృదువుగా మారకూడదా?"

"మారదు. దాని స్వభావం అది. ఆ సంగతి గ్రహించి మన జాగ్రత్తలో మనం ఉండటం బెటర్"

ఆర్‌జిబి ఇన్ఫోటైన్ ఉగాది కథల పోటీలో తృతీయ బహుమతి పొందిన కథ

# దృక్పథం

ఇంకో రెండు గంటల్లో 'పల్స్ 17' ప్రారంభం కానుంది.

ఇంజినీరింగు కాలేజీ విద్యార్థులూ మేనేజ్‌మెంటు వారూ కలిసి భారీ ఎత్తున వార్షికోత్సవం చేస్తున్నారు.

ప్రిన్సిపాల్ డాక్టర్ సదాశివం ఏర్పాట్లన్నీ పర్యవేక్షించి పెదవి విరిచారు. ముఖమూ వికృతంగా మారిపోయింది.

"ఇదేంటి? ఇది స్టేజా? ఇద్దరు మంత్రులు, ఎంపీగారు మన కాలేజ్ కమిటి చైర్మన్‌గారూ వస్తోంటే ఎంత పోష్‌గా ఉండాలి? ఇలా సాదా సీదాగా లాగించేస్తే...ప్చ్ బాగోలేదు. బ్యాగ్రౌండ్ ఫ్లెక్సీలో యువతీ యువకుల ఆ ఎగురుళ్ళేవిటి? ఏం బావోలేదు. మన కాలేజీ ఘనతని చాటేలా ఉండొద్దూ? ఈ డెకరేటివ్ ప్లాంట్స్ ఏవిటప్పుడే తలలు వేలాడేశాయి? మీరేదో అదరగొడతారనుకుంటే ఇలా తగలేశారేంటి? వెరీ బ్యాడ్. వీఐపీల ముందు నా తల కొట్టేస్తున్నారు. ఇంకా అలా చూస్తూ నిలబడితే కాదు. త్వరగా ఏదోటి చేసి పరువు నిలపండి....!"

స్టాఫ్ మీదా, విద్యార్థి నాయకుల మీదా కస్సుమన్నారు. ఎన్నో సూచనలూ చేశారు. మిగిలివున్న అతికొద్ది సమయంలో అవేమీ చేయలేమని ఇరువర్గాలకీ తెలుసు. అయినా ఆయన చెప్పారు. వీరు విన్నారు.

"అతిథి మర్యాదలు ఘనంగా చేయాలి. ముఖ్యంగా మీడియా వారిని బాగా ఇంప్రెస్ చెయ్యాలి. రేపు అన్ని ఛానళ్ళలో పేపర్లలో మన కాలేజీ పేరు మార్మోగిపోవాలి. అన్నట్టు వారికిచ్చే గిఫ్టులు రెడీయే కదా?" పీఆర్వోని అడిగారు.

"రెడీ సార్. మ్యాటరూ ఫోటోలూ కూడా సిద్ధం చేశాం..."

అయినా అసంతృప్తిగా చూశారు. "క్యాంపస్ సెలక్షన్స్ గురించీ, దానికోసం మనం ఇస్తోన్న ప్రత్యేక శిక్షణ గురించీ, యూనివర్శిటీ ర్యాంకుల గురించీ ఆ నోట్‌లో రాశారా లేదా?"

"రాశాం సార్. ఒక్కసారి అటు చూడండి. గేటు దగ్గర్నుంచి స్టేజిదాకా రోడ్డుకి ఇరుప్రక్కలా అమర్చిన ఫ్లెక్సీల నిండా విజేతల ఫోటోలు వేయించాను" కించిత్తు గర్వంగా చెప్పాడు పీఆర్వో.

"లాస్టియర్ పదిహేను లక్షల ప్యాకేజ్ వచ్చిందే ఆ కుర్రాడు రాజేష్ ఫోటో వాటిల్లో ఉంది కదా?"

"ప్రవేశ ద్వారం దగ్గర ఉన్న పెద్ద ఫ్లెక్సీ అతడిదే సార్. ప్రెస్సూ పబ్లిక్కూ ఎవ్వరూ మిస్ కానంత పెద్దది అరేంజ్ చేశాను" భుజాలెగరేశాడు.

"రెస్పాన్స్ ఎలా వుంటుందో చూస్తానుగా. ఈసారి ఎమ్సెట్ ర్యాంకర్ల ఫస్ట్ ప్రిఫరెన్స్ మన కాలేజీయే అవ్వాలి. మేనేజ్‌మెంట్ కోటాకి డిమాండ్ పెరగాలి. అప్పుడే యాజమాన్యం మనల్ని గుర్తిస్తుంది. మైండిట్. సో, మన సక్సెస్ మన మార్కెటింగ్ స్కిల్స్‌మీదే ఆధారపడి ఉంది. అందుకు ఈ ఈవెంట్‌ని 100% కాదు 200% ఉపయోగించుకోవాలి...."

ఇంకేదో చెప్పబోయిన సదాశివం దృష్టి ఓ ప్రక్కగా ఉన్న టెంట్ మీద పడింది.

"అదేవిటి?" నుదురు ముడివేసి మరీ ప్రశ్నించారు.

"మన విద్యార్థులు కొందరు ఏదో సేవా కార్యక్రమం ప్రారంభించారు..."

"నాకు తెలీకుండా నా కాలేజీలో సేవలూ గీవలూ ఏంటి?"

ఆయన ముఖం ఎర్రబడింది. స్వరం తీవ్రతని సంతరించుకుంది. దాంతో పీఆర్వో గొంతులో పచ్చివెలక్కాయ పడింది.

గబగబా అటు నడిచారు ప్రిన్సిపాల్. పీఆర్వోకీ అనుసరించక తప్పలేదు.

నాలుగు చేతులు చతురస్రాకారంలో కలిసినట్టుగా వున్న బొమ్మ మధ్య 'హెల్పింగ్ హ్యాండ్స్' అని రాసి వున్న చిన్న ఫ్లెక్సీ టెంట్‌కి వేలాడుతోంది.

ఆయనకి ఒళ్ళూ పై తెలియని కోపం వచ్చేసింది. లోపలికెళ్తూనే, "వాటీజ్ దిస్ నాన్సెన్స్? వాటీజ్ గోయింగాన్ హియర్?" అరిచారు సదాశివం.

విద్యార్థుల దగ్గర్నుంచి రక్త నమూనా సేకరిస్తున్నవారూ, బ్లడ్‌గ్రూప్ టెస్టు చేస్తున్న యువకులూ అదిరిపడి చూశారు.

వారి లీడర్ ప్రహ్లాద్ ముందుకొచ్చాడు "వెల్కం సార్..."

అతడి వెనుక పదిమంది వరకూ విద్యార్థినీ విద్యార్థులు చేరి వినయంగా నిలబడ్డారు.

ఒకరు గబగబా కుర్చీ తెచ్చి వేశారు.

దాని వంక చూడలేదు. "ఇక్కడేం జరుగుతోంది" గద్దించారు.

"స్టూడెంట్స్ బ్లడ్ శాంపిల్స్ తీసుకుని, ఏ గ్రూపు రక్తమో చెప్పిస్తున్నాం సార్. రక్తదాన ప్రాముఖ్యతని వివరిస్తూ అందుకు సిద్ధపడ్డ వారి ఫోన్ నెంబర్లూ ఎడ్రస్సులూ తీసుకుంటున్నాం సార్..." ప్రహ్లాద్ వివరించాడు.

"నాకు చెప్పకుండా క్యాంపస్‌లో ఈ న్యూసెన్సేవిటి?" కోపం మరో డిగ్రీ పెరగ్గా అరిచారు.

ఆంధ్ర సారస్వత సమితి, మచిలిపట్నం వారి స్వర్ణోత్సవ కథల పోటీలో
ప్రథమ బహుమతి పొందిన కథ

# జమ్మిచెట్టు

"**అ**బ్బాయ్ స్వామీ. మే నెల రెండోవారంలో పండుగ ఉందిరా. నువ్వూ కోడలూ మనవణ్ణి తీసుకుని తప్పకుండా రావాలి. మీ నాన్నగారు మరీ మరీ చెప్పమన్నారు..."

"మేలో ఏం పండగ ఉందమ్మా?"

"మన కుటుంబ పండుగ... అమెరికా నుంచి రావాలి కదా. ప్రయాణ ఏర్పాట్లు చేసుకుంటారని రెండు నెలలు ముందుగా చెబుతున్నాం. తప్పకుండా రండి సుమా. నాలుగో ఏడు వచ్చేసినా మేమింకా మనవణ్ణి చూడనే లేదు కదురా...!" బాధగా అంది లలితాంబ.

గతుక్కుమన్నాడు స్వామి. "ఫ్యామిలీ ఫంక్షన్ అయితే ఎందుకు మిస్సవుతాం. ఖచ్చితంగా వస్తాం" అనేశాడు.

"ఇండియా రమ్మంటున్నారా? ఇప్పుడెందుకట? రానూపోనూ బోల్డు ఖర్చు. జీతం నష్టం. పైగా అక్కడ మే నెల ఎండలు. నిలువునా మాడిపోతాం!" ముఖం వికారంగా పెట్టుకుని అంది శ్యామల.

"రితీష్‌ని అమ్మా నాన్నా చూడలేదు. క్రితం నెలలో నాన్నగారికి హార్ట్ ఆపరేషన్ చేసినప్పుడూ మనం వెళ్ళలేదు....."

"అందుకని, ఇలా వంకపెట్టి రమ్మంటున్నారా?!"

"బహుశా పెనుగండం గడిచిందని నాన్నగారు హోమం లాంటిదేదైనా చేస్తున్నారేమో. లేదా మ్యారేజ్ డేయో, బర్త్ డేయో అయ్యుండొచ్చు. ఈ మధ్య తరచూ నాన్నగారు కలలోకి వస్తున్నారు. చూడాలని నాకే ఎంతో ఇదిగా ఉంది. వాళ్ళకి ఉండదూ? మనం ఇండియా వెళ్తున్నాం. అంతే!"

ఆమె గుండెల్లో బండరాయి పడింది! రితీష్ వంక చూసింది. వాడొక్కడూ ఒక మూలన కూర్చుని ఆడుకుంటున్నాడు. తనలో తను ఏదో చెప్పుకుంటున్నాడు. ఆమె

మనసులో దిగులు ముసురు పట్టింది!

మర్నాడు ఆఫీసు నుంచి బెంగళూరులో ఉంటోన్న అన్నగారు రాఘవకి ఫోన్ చేశాడు స్వామి.

"మే నెలలో ఇంటికి రమ్మంటూ అమ్మ ఫోన్ చేసింది. ఎందుకన్నయ్యా?"

"నాకూ చేసింది. సంగతేవిటో నాకూ తెలీదు. అసలే ఎస్కలేషన్ అయ్యిందని ఛస్తున్నాం. ఇంక టూర్లకెలా రాగలం!"

"ఏం? మీ ప్రాజెక్టు వర్కు క్లయింటుకి నచ్చలేదా?"

"ప్రతీసారీ ఏవో మార్పులూ చేర్పులూ చెబుతూనే ఉంటారు. ఎలా చచ్చేది!"

"అయితే ఆఫీసులో పని ఒత్తిడి ఎక్కువగా ఉంటోందా అన్నయ్యా?"

"ఎప్పుడూ ఉండే ప్రెషర్లేలే. అందరికీ సాఫ్ట్‌వేర్‌లో పెద్ద జీతాలే కన్పిస్తాయి కాని కష్టాలూ ఒత్తిళ్ళూ అర్థం కావు. అమెరికా క్లయింట్ల టైమింగ్సుకి అనుకూలంగా పనిచెయ్యాలి. అర్థరాత్రీ అపరాత్రీ అని లేకుండా కాల్స్ తీసుకోవాలి. ఈ మధ్య సాటర్‌డేస్ కూడా వెళ్ళాల్సి వస్తోందిరా. మీకే నయం. అమెరికాలో హాలిడేస్‌లో పనిచేయక్కర్లేదు గనుక వీకెండ్స్ చక్కగా ఎంజాయ్ చేస్తారు!"

నవ్వేడు స్వామి "అందుకే సీత కష్టాలు సీతవి, పీత కష్టాలు పీతవి అంటారు"

"ఇంతకీ మీరొస్తున్నారా లేదా?"

"నాన్నగారు రమ్మన్నాక తప్పదు కదా, వస్తాం. మీరూ రండి అన్నయ్యా"

"వస్తాంలే. ఆసరికి ప్రాజెక్టు డెలివరీ అయిపోతుందనుకుంటున్నాను" చిన్నగా నిట్టూరుస్తూ అన్నాడు రాఘవ.

* * *

హైదరాబాద్‌లో విమానం దిగి తిన్నగా అత్తవారింటికెళ్ళారు స్వామి, శ్యామల.

రితీష్‌ని దగ్గరకి తీసుకోవాలని చూసింది అత్తగారు. వాడు వెళ్ళలేదు. ఆమె వంక కన్నెత్తి చూళ్ళేదు. ఎంతగా ప్రయత్నించినా నోరు విప్ప లేదు. పిలిచినా పలక్కుండా తనని కానట్టుగా ఉండిపోయాడు.

"నీ కొడుకు మూగిలా మడ్డీగా ఉన్నాడేంటే శ్యామలా!"

సర్రున కోపం వచ్చేసింది శ్యామలకి. "ఇంకో మాటంటే వూరుకోను..." వాణ్ణి ఎత్తుకుని గదిలోకి తీసుకుపోయింది.

అవాక్కయ్యిందావిడ.

ఇంటికి ఫోన్ చేసి తాము వచ్చినట్లు చెప్పాడు స్వామి. ఎంతగానో పొంగిపోయింది

జాషువా 118వ జయంతి సందర్భంగా తెలుగు అకాడమీలోని
జాషువా పరిశోధనా కేంద్రం నిర్వహించిన కథల పోటీ - 2013లో
ప్రత్యేక బహుమతి పొందిన కథ.

# గబ్బిలం

**ఆం**డాళ్ళమ్మ మడి కట్టుకుని పూజ చేస్తున్నారు.

ధూపదీప నైవేద్యాలయ్యాక సర్వ దేవుళ్ళనీ ప్రార్థించారు. కొడుకుల్నీ కూతుళ్ళనీ కోడళ్ళనీ అల్లుళ్ళనీ మనవల్నీ మనవరాళ్ళనీ కనిపెట్టుకుని చల్లగా చూడమని విన్నవించారు. తనకు అనాయాసేన మరణం ప్రసాదించమని అర్థించారు.

పిమ్మట తులసిమాల చేతిలోకి తీసుకుని కళ్ళు మూసుకుని 'హరే రామ హరే కృష్ణ....' అంటూ పఠిస్తూ ఒక్కోసారికీ ఒక్కో పూస చొప్పున లెక్కించసాగారు.

ఆవిడ మనో నేత్రం ముందు ఉత్తుంగమహోన్నత హిమవన్నగాలు వెండికొండల్లా మెరిసిపోతూ దర్శనమిస్తున్నాయి. వాటి మీద ఒక ప్రక్క శివుడు ఆనంద తాండవం చేస్తోంటే, మరో ప్రక్క కేశవుడు వెన్నెల వెలుగై ఆనంద స్వరూపమై తిలకిస్తున్నాడు.

మనస్సు దూది పింజె అయి తేలిపోతోంటే అలౌకికానందానుభూతిలో నిలువునా తడిసిపోయారు.

మాలలోని పూసలు పూర్తయ్యాయి.

కళ్ళు తెరిచారు. ఇహానికొచ్చారు. ఆ అద్భుత దృశ్యమాలిక అదృశ్యమయ్యేసరికి అనంతమైన నిరాశ ఆమె కళ్ళల్లో మిల మిలలాడింది. చిన్నగా నిట్టూర్చారు.

'ఆ దివ్య ధామాన్ని చూడటానికి నా కళ్ళు పుణ్యం చేసుకున్నాయో లేదో! ఈ జన్మలో శివకేశవుల విశ్వరూప దర్శన భాగ్యం వుందో లేదో!'

మళ్ళీ నిట్టూర్చారు. పెరట్లోకెళ్ళి సూర్యనారాయణుడికి నమస్కరించి వచ్చి ఇన్ని కాఫీనీళ్ళు గొంతులో పోసుకున్నారు.

'పిల్లలెవరూ ఫోన్ చెయ్యనేలేదు సుమా' అనుకున్నారు. ఆ వెంటనే, 'పొద్దుటే ఎక్కడ కుదుర్తుందిలే' అని తనకు తనే సమాధానం చెప్పుకున్నారు.

వంట ఏర్పాట్లలో ఉండగా "అమ్మగోరూ" అంటూ వీధిలోంచి పిలిచారెవరో.

"వస్తున్నా" తెల్లచీర కొంగు తలమీదకు లాక్కుని "ఎవరూ" అంటూ వీధి అరుగు మీదకెళ్ళారు.

దావీదూ, ఓ యువకుడూ ఇంటిముందు నిలబడి ఉన్నారు.

"ఒరే దావీదూ నువ్వుట్రా. బొత్తిగా నల్లపూసైపోయావేంట్రా. ఈ మధ్యసలు ఈ పక్కకే రాలేదేంరా!" నిష్ఠూరంగా అన్నారు.

బుర్రగోక్కున్నాడు దావీదు. "కర్రోరి మావిడి తోటలో కాపలాకి కుదురుకున్నానండి"

"కొడుకులు అందివచ్చారాయె. చేలో దిగాల్సిన కర్మేంటి నీకూ!" అని ఆగి దావీదు పక్కనున్న యువకుడి వంక చూస్తూ, "వీడెవడూ? నీ కొడుకా!" అనడిగారు.

"గబ్బిలంగాడండి........"

అతడ్ని తేరపారి చూస్తూనే బుగ్గలు నొక్కుకున్నారు. నల్లగా ఉన్నాడు. కండలు తిరిగి ఉన్నాడు. ఒంటిచేత్తో ధాన్యపు బస్తాని అవలీలగా బండికెక్కించేలా ఉన్నాడు.

"సన్నగా బక్కగా ఎలక తోకలా ఉండేవాడు. ఎంతలో ఎంతోడయ్యాడూ!"

"ఆయ్. అంతా తవరి దయేనండి. పుట్టిన బిడ్డలు పురుట్లోనే పోతన్నారని ఈడికి తవఁరే గబ్బిలం అని పేరెట్టేరండి. ఈడు బతికి బట్ట కట్టేసేడు......" దావీదు కళ్ళల్లోనే కాదు సర్వాయవాల్లోనూ కృతజ్ఞత ఉట్టిపడుతోంది.

"గబ్బిలమంత వికృతపక్షి ఎక్కడా ఉండదొరేయ్. దానికి నోరూ మలద్వారమూ ఒక్కటే. అలాటి పేరెడితే ఎందుకో బతుకు తాడన్పించింది......."

"పేర్లో ఏవుందమ్మగోరూ, పదిమంది సేత మంచోడన్పించుకుంటే శాన....!"

"కబుర్లు బాగా నేర్చావొరేయ్....." అనింకేదో అనబోయిందల్లా ఆగిపోయింది. దావీదు ఎడంగానే నిలబడ్డాడుగాని గబ్బిలం అరుగుని తాకుతూ నిలబడ్డాడు.

ఆవిడ మొఖంలో కదలాడిన వికృత భావాలు చదివిన వాడల్లా గతుక్కుమని కొడుకుని వెనక్కి లాగేడు దావీదు. కోపంగా చూశాడు కొడుకు.

"పోట్లగిత్తలా ఉన్నాడు. ఏం చేస్తున్నాడేంటి! బడికి పంపించినట్టున్నావ్, నాలుగు అక్షరం ముక్కలన్నా ఒంటబట్టాయా లేదా!"

"వానాకాలం సదువు సదివేడండి. ఏదో ఉజ్జోగం రాకపోదనుకుంటే మాకెవరికీ సెప్పాసెయ్యకుండా మిలట్రీలోకి పోయేడండి......"

ఇంతింత కళ్ళతో చూశారు ఆండాళ్ళమ్మ. "ఎందుకూ పనికి రాని వాళ్ళే మిలట్రీలో కెళ్తారు. ఇంకే దిక్కూ లేనట్టు యుద్ధాలు చెయ్యడానికెళ్ళేవన్నమాట !" కించిత్తు హేళనగా అన్నారు.

"అవసరమైతే చెయ్యాలండి. మన సరిహద్దుల్ని కాపాడుకోవాలి. దేశాన్ని రక్షించుకోవాలి....." అన్నాడు గబ్బిలం.

అతడి మాటల్లోని ఆత్మవిశ్వాసానికి అబ్బురపడకుండా ఉండలేకపోయారు.

"పిల్లకాకివి. ఏదో అనుకుంటున్నావుగాని రక్షించే పని నీదీ నాదీ కాదు, ఆ పైవాడిది. నారువేసి నీరుపోసి నిన్నింతవాడ్ని చేసింది ఆ పరమాత్ముడే....ఒరే దావీదూ – వీడూ

**గురజాడ 147వ జయంతి సందర్భంగా శ్రీ వేదగిరి కమ్యూనికేషన్స్ నిర్వహించిన కథల పోటీలో బహుమతి పొందిన కథ.**

# ఆశావహం

**కు**ళాయి దగ్గరి గోలమాటలకి మెలకువ వచ్చింది. టైము అయిదన్నమాట. ఏంటో. స్వతంత్ర భారతి స్వర్ణోత్సవం జరుపుకున్నా తాగునీటి కోసం 'పానీ' పట్టు యుద్ధాలు తప్పడంలేదు....!

ఆ గొడవకేం గాని ఇవాళెలా గడవబోతోందో !

షరా మామూలే.

పరుగెత్తడం పనిచెయ్యడం తినడం నిట్టూర్చడం నిద్రపోవడం – యాంత్రిక జీవనం!

తెల్లారితే చాలు మళ్ళీ రోజు మొదలైందా అన్న దిగులు. ఎప్పుడు చీకటి పడుతుందా అని ఎదురుచూట్టం. పడకెక్కేక ఇక తెల్లారకుండా వుంటే బావుద్నన్న ఆశ. అయినా తెల్లారుతుంది. మళ్ళీ పరుగు పందెంలోకి...!

తప్పించుకోలేని ఇనుపచట్రం ! దేవుడూ ! నన్ను రక్షించు ఈ రసహీన జీవితం నుంచి !

తిలక్ కవిత్వం బావుంటుంది. తన అక్షరాలు వెన్నెల్లో ఆడుకునే అందమైన అమ్మాయిలట. ఎంత హృద్యంగా చెప్పేడు ! హేట్సాఫ్ !

అమ్మా.....యి ! మొదట తండ్రికీ తర్వాత భర్తకీ పిమ్మట పిల్లలకీ అమ్మ అయ్యే అపురూప మూర్తిత్వం ! ఫ్చ్... నా గీతల్లో జంట గీత వున్నట్టు లేదు. అసలు ఏ గీత తిన్నగా వుందనీ ! అన్నీ గజిబిజి గీతలు. పిచ్చి గీతలు. పద్మవ్యూహంలో చిక్కుకున్న అభినవ అభిమన్యుడ్ని!

బాపురే! టైం పరుగెడుతోంది. కాదు కాదు – నా చేతివేళ్ళ సందుల్లోంచి జారిపోతోంది – నా వయస్సులానే !

రెండంగల్లో బాత్‌రూంలోకి జంప్. మరి పది నిమిషాల్లో మొఖం కడిగి పారేసి... ఎంత కడిగినా తోమినా నల్లతోలు తెల్లబడదు.....టీవీలో చూపే అద్భుత క్రీమ్ వాడితే? పోనిద్దూ ఇప్పుడే కన్నెపిల్ల కన్ను గీటాల్లే! అవునూ. ముప్పైమూడు దాటి ముప్పై నాలుగులో అడుగుపెట్టి నాల్రోజులై పోయింది సుమా.

పుట్టిన్రోజులు చిన్నప్పుడే గుర్తుంటాయి. పెద్దయ్యాక దారి పొడవునా నిరాశలూ నిట్టూర్పులూ అని తెలిశాక.....!

కాఫీ నీళ్ళు మరిగాయి. కాఫీ వాసన ఆఘ్రాణిస్తూ సిప్‌చేస్తూ టీవీ ముఖంలోకి

తొంగి చూస్తూ మళ్ళీ సిప్ చేస్తూ ఆలోచనల్లో సింకవుతూ...

టెర్రరిస్టుల ఘాతుకాలు సీరియల్‌గా.....ఒకప్పుడు వేదభూమి పుణ్యభూమి శాంతి భూమి...ఇవాళ తుపాకుల పేలుళ్ళు! బాంబుల విస్ఫోటనాలు! కకావికలవుతోన్న మానవాంగాలు! భయం గుప్పిట్లో జనం! జనం గుండెల్లో అభద్రత! పావురాలెగిరిన చోట రక్తం ఏరులై పారుతోంది!

ఓ మహాత్మా! ఓ మహర్షీ! ఇదీ నువ్వు కనని కల! నేటి కఠిన వాస్తవం! బతుకు తీపి ఎరుగని తల్లి ప్రేమ పాలు తాగని వీర మతోన్మాదులు! తోటి మనిషి ప్రాణాలు హరించే హక్కు ఎవరిచ్చారో!

చోడో యార్. ఛానల్ మార్చా...భక్తి ఉపన్యాసాలు.....అన్నట్టు తెలుగునాట భక్తి రసం తెప్పలుగా పారుతోందన్న కవి చివరి దశలో భక్తుడిగా మారాడు కదూ? శక్తి తగ్గేక తనువు వంగేక, కన్పించని శక్తి కటాక్షం కోసం అలమటిస్తాడు మనిషి. వయస్సులో ట్రాష్ అన్పించింది వయస్సుడిగేక ట్రాప్ చేస్తుంది. ముందు గతి కానవే చిలకా....!

వణకుతూ స్నానించి ఇంటికి తాళం వేసి! ఇది ఇల్లా గూడా నిద్రపోయే ప్రదేశమా? వద్దొద్దు. తేనెతుట్ట కదిలించొద్దు...ఛలో...

యథాలాపంగా తలెత్తాను – అబద్ధం – అలవాటు ప్రకారమే చూశాను. నన్నే చూస్తున్న రెండు కళ్ళు దిశ మార్చుకున్నాయి. అయినా పెదాలు విడీవిడనట్టు నవ్వాయి. నా గుండెతో దోబూచులాడాయి......

ప్రకాషి నవ్వు ఎంత బావుంటుందో ! వెన్నెల కిరణం చిట్లినట్టు.....గుండె తంత్రులు ఝల్లుమని మ్రోగి తీరాల్సిందే...రవి వర్మ చూసుంటే మోనాలీసాని తలదన్నే చిత్రం ఊపిరి పోసుకునేది!

భాస్కర్ గాడు ఓ వెధవ. ఈ అపరంజి నవ్వునీ బతుకునీ 'స్వంతం చేసుకోరా' అన్నాను. ఇడియట్! నా కళ్ళకి ఉత్తమంగా కాదు ఉత్తగా కన్పిస్తోందనేశాడు చత్వారం గాడిద ! ఇంతింతలావు కళ్ళద్దాలూ వాడూనూ! అలా అని వూరుకున్నాడా? లేదు. అదోలా నవ్వుతూ 'నువ్వే చేసుకో వచ్చుగా!' అని కూశాడు!

వాడు నిజంగా ఫూల్. నేను ముందే ఆశపడిన సంగతి వాడి ఊహకి అందలేదు.

ఆమె నవ్వుతో బతుకు వెలిగించుకోవాలనెళ్ళానో రోజున. ఏడాది పరిచయంతో ఆమెకెలాంటి వరుడ్ని వెదుకుతున్నారంటూ ఆరా తీశాను. ప్రకాషి ఇంతింత కళ్ళతో చూసి లోపలి కెళ్ళి పోయింది. ఆమె తండ్రి పెద్ద నోరు తెరిచాడు.

“సాఫ్ట్‌వేర్ ఇంజినీరైతే బెటర్. ఇంకో జాబ్ అయినా ఓకే గాని శాలరీ థర్టీప్లస్ వుండాలి. అత్తమామల పోరు వుండ కూడదు. బాధ్యత లుండకూడదు. కారుంటే ఫైన్...”

లిస్టు పూర్తి కాలేదు గాని సగం తాగిన కాఫీ కప్పుని ఠపీమని పెట్టేసి పరుగునొచ్చేశాను. నా లోలోపలి ఆశ బయట పెట్టనందుకు నన్ను నేను అభినందించుకున్నాను. ఇరుగు

**End of Preview.**

**Rest of the book can be read @**

**[http://kinige.com/book/Simha+Prasad+63+Bahumati+Kathanikalu](http://kinige.com/book/Simha+Prasad+63+Bahumati+Kathanikalu)**

* * *